గడియారం



కొటూరు విజయకుమార్ రాజు

"శానా బావుంది బావా ! యాడదీ... కొన్నావా ?" కొత్త చేతిగడియారాన్ని సంబరంగా చూస్తు అడిగింది మల్లి.

"మన మెందుకు కొంటామే ? కొత్తగా పెళ్ళిచేసుకున్నాననగానే మా అయ్యగారు యిచ్చారు..." అన్నాడు చెంద్రిగాడు, పోజుగా.

"ఎట్టా ? ! మీ అయ్యగారికి నువ్వంటే అంతిదా ?" ఆశ్చర్యపోతూ అంది.

"మరేంటనుకున్నా ?"

"శానా కరీదనుకుంట..." కిందికీ మీదికీ తిప్పుతు అంది.

"ఆఁ...ఎం త, మూడొందలుంటుంది..."నవ్వు అణచుకొని అన్నాడు.

"మూడొందలే!" కళ్ళు పెద్దవి చేసుకు చూసింది

తండ్రి వేసిన కొత్త గుడిసెకి మూడొందలయింది!

గుప్పెట్లో కొచ్చే గడియారం వెల మూడొందలుంటే–'ఎంత గొప్పదో!' అనుకుంది.

"మీఅయ్యగారు శానా మంచోరు..." అంది

"అందుకే కారిచ్చి పంపారు...నువ్వు తొందరగా తయారుకా సిన్మాకి పోదాం..."

"సిన్మాకా? అమ్మో...అమ్మో... ఏందియ్యాల..." చిలకమ్మలా రాగాలు తీస్తు అడిగింది.

"అయన్నీ అడగమాక...ముందల రడీ కావాల..."

"సిటికెలో రడీగానూ..." అంటు ఉతికిన చీర అందుకుని లోపలికి నడిచింది మల్లి.

మురిపెంగా పెళ్లాం నడకల్ని చూస్తుండిపోయేడు చెంద్రిగాడు.

* * *

"చక్కగా సిన్మా ఏక్టరులా ఉందిరా." మల్లికేసి నఖశిఖ పర్యంతం చూస్తు అన్నాడు నందగోపాల్.

మల్లి సిగ్గుల జల్లులో తడిసిపోయి మొగుడెనకాల దాక్కుంది

చెంద్రిగాడి పెదవులమీద గర్వరేఖ కదిలింది.

"ఏం పిల్లా...నీ పేరేంటో చెప్పావ్ కాదు..." కవ్వింపుగా చూస్తూ ప్రశ్నించాడు నందగోపాల్.

చూపుడు వేలు పళ్ల మధ్య కొరుకుతు పెద్ద కళ్ల మీద బరువుగా రెప్పలు వాల్చి మౌనంగా ఉండిపోయింది మల్లి.

"చెప్పు..అయ్గారు అడగటంలా."

మొగుడు గదమాయింపుకి బెదిరి "మల్లి" అనేసింది చటుక్కున

బిగ్గరగా నవ్వుతు "ఓహ్...భలే పేరురా...తెల్లచీరలో మల్లెపువ్వు లాగానే ఉంది..." యింకా నవ్వుతుండగానే లోపల టెలిఫోన్ మ్రోగటం విన్పించింది.

నవ్వటం ఆపి, వేగంగా అటెళ్ళాడు నందగోపాల్.

"ఏంది మీ అయ్యగారట్టా నవ్వుతారు? నాకేందో బయంగా ఉంది... పోదాం పద...సిన్మాకి టైం గాలా?" అంది వేలికి కొంగు చుట్టుకుంటు.

"ఓ సెర్రిమొగమా కార్లో ఎంతటయిం పడద్దే? అయ్గారు పైక్లాసులో టికెట్లు తెప్పించారు...ఇయిగో సూడు." జేబులోంచి టికెట్లు తీసి చూపేడు, చెంద్రిగాడు. అవి కొని తెచ్చింది వాడే!

"అంటే మేడ మీన కూకుంటమా?" ఆశ్చర్యంగా కళ్లు తాటిస్తు ప్రశ్నించింది.

"మరేందనుకున్న?" కాలరు సరిజేసుకున్నాడు గర్వంగా.

"ఓ...ఓ...బాగనే ఉన్నవ్ లేవోయ్

...మాంటికీ, మాంటికీ కాలరెత్తుతున్నవు గాని..." లోలోపల ఆనందిస్తూనే పైకి ఎద్దేవా చేసింది, మల్లి.

వాళ్ళు మాటల్లో ఉండగానే గొంతు సరిజేసుకుంటు వచ్చాడు నందగోపాల్.

ఇప్పుడతని మొహం యిందాకటిలా లేదు.

ఏదో మధనపడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

వచ్చి వాళ్ళ కెదురుగా నిలబడి, స్తబ్ధంగా ఎటో చూస్తుండిపోయా, దొక నిముషం.

చెంద్రిగాడు ఆగలేక అడిగేడు.

"ఏంటిబాబూ...అలాగున్నారేంటి?"

ఉలిక్కిపడ్డట్టు చెంద్రిగాడ్ని చూసేడు.

"అదేరా...నీతో ఎలా చెప్పాలో తెలియక..." తికమకగా చేతులు కదిలిస్తూ అర్థోక్తిలో ఆగిపోయేడు నందగోపాల్.

"పర్లేదు చెప్పండి బాబూ..." ఆత్రంగా అడిగేడు.

"నా ఫ్రెండ్ వెంకటరత్నం లేడూ . వాళ్లమ్మగారికి సీరియస్‌గా ఉందట. అర్జంటుగా వెళ్ళాలిట...కారు కావా లన్నాడు."

"దాన్దేముంది, మేం రిక్షాలో పోతాం లెండి. కారు తీసికెళ్ళమనండి..." అనేశాడు చెంద్రిగాడు తేలిగ్గా

"నేనూ అదే అనుకున్నానూ గానీ... వెంకటరత్నానికి డ్రైవింగ్ రాదు...పైగా మన కారులో గేర్ల ట్రబులుంది గద? అది నీ కొక్కడికే తెలుసు. పోనీ నే వేళ్దా మంటే డాక్టరుగారు ఆర్నెల్లదాకా కారు నడపొద్దన్నాడు..."

చెంద్రిగాడి మొహంలో నిముషంలో పదిరంగులు తిరిగేయి.

వాడు ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నాడు.

వెనకాల—వీపుని దాదాపు ఆనుకు నిలబడ్డ మల్లి స్పర్శ వాడి మనసుని మరింత అల్లకల్లోల పెట్టింది.

సినిమా ఆశ పెట్టి తీసుకొచ్చాడు.

ఇప్పుడిలా...

అసలీ గొడవంతా లేకుండా హాయిగా గుట్టుచప్పుడు లేకుండా, ఏ శలవురోజునో కింది టికెట్టు కెళ్ళుంటే బావుండేది.

అయ్యగారి మాట కాదన్లేకపోయేడు. అందుక్కారణం లేకపోలేదు.

అయ్యగారు తనకి కొత్త జీవితం యిచ్చేడు

యాక్సిడెంటు చేసి జైలు కెళ్ళొచ్చిన తనని ఆయన గనక డ్రైవరుగా పెట్టుకున్నాడు !

"ఆ యాక్సిడెంటులో తప్పు నీది కాదని నాకు తెలుసురా...ఏ డ్రైవరైనా ఆ పనే చేస్తాడు. చచ్చిపోయింది కానిస్టేబుల్ గనక నీకు శిక్ష తప్ప లేదంతే" అని ధైర్యం చెప్పాడు.

ఆ రోజునుండీ అయ్యగారు తనకి ఆరోప్రాణం.

కానీ...కానీ...

వాడి గుండెలోంచి సూదిలా పొడుచు కొచ్చిందొక బాధ...

స్వయంగా అనేకమాట్లు కిరాయి కొచ్చే ఆడపిల్లల్ని తీసుకొచ్చి యిక్కడ దింపాడు !

అయ్యగారి అలవాట్లు తెలిసీ...అమా యకం విడని పెళ్ళాన్ని వదిలి, ఎక్కడో ఎవరికోసమో కారు తీసుకెళ్ళటమా ?

వాడి మెదడులో తిరుగుతున్న భావా లన్నింటినీ మొహంలో చదువుతూ ఓ సిగిరెట్ వెలిగించుకున్నాడు నందగోపాల్.

"ఓ పనిచేస్తే ఎలాగుంటుంది బాబూ."

"ఏ పని ?" అన్నాడు సిగిరెట్ పొగ వదుల్తు.

"మల్లినింటికాడ దింపి ఎల్తే ?"

నవ్వేడు నందగోపాల్.

"ఒరే చెంద్రిగా ! అర్థంటు అంటే తెల్సురా నీకసలు ? కొంప లంటుకుంటే ఫైరింజన్లెలా పరుగెడతాయ్ ? అసలీ పాటికి నువ్వు సగం దూరంలో ఉండాల్సింది. అవతల వెంకటరత్నం ఎదురుచూస్తుంటాడు. అంత అవసర మన్పిస్తే మల్లిని కూడా నీతో బాటు కార్లో వాళ్ళూరు తీసికెళ్ళు.కానీ-అదంత మంచిపననుకోను..."

చెంద్రిగాడికి తను వెళ్ళక తప్పదని అర్థమైపోయింది.

నిస్సహాయంగా మల్లికేసి చూసేడు.

అది పులిగుహలోకి పొరబాటున దూరిన మేకలా మొగుడు మొహంకేసి భీతి నిండిన కళ్ళతో చూస్తోంది.

* * *

గోడగడియారం ఎనిమిది గంటలు కొట్టింది.

అన్నిమాట్లూ ఎవరో తన నెత్తిన సుత్తితో కొట్టినంత బాధగా తల పట్టు కున్నాడు నందగోపాల్.

బ్యాండేజి చేతికి గట్టిగా తగిలింది. వేదనగా మూలిగేడు. అంతలోనే పీక ఎండిపోతున్నంత దాహం వేసింది.

ఆర్తిగా అటు, యిటు నర్సుకోసం కళ్ళతో వెతికేడు

పక్క బెడ్డుమీద-జ్వరం నుండి కోలుకుంటున్న భర్తకి రొట్టె తినిపిస్తున్న వయసు మళ్ళినావిడ కన్పించింది.

అతని చూపుల్లో భావాన్ని చదివినట్లు "ఏమన్నా కావాలా నాయనా ?" అనడిగింది ఆప్యాయంగా.

"మంచినీళ్ళు..." అన్నాడు పెదవులు తడి చేసుకుంటు.

ఆవిడ వెంటనే మరచెంబులోంచి గ్లాసెడు నీళ్ళు వంచి, అందులో యింత గ్లూకోజు పడేసింది చమ్చాతో బాగా కలిపి కొడుక్కి పట్టినంత ఆపేక్షగా అతనిచేత తాగించింది. తిరిగి అతన్ని



పక్కమీద మృదువుగా పడుకోబెట్టి వెళ్ళింది.

నందగోపాల్ గుండెకి కొత్తబలం చేకూరినట్లనిపించింది

అతనిలో యిప్పుడిప్పుడే వివేకం రేకలు విప్పటం ప్రారంభించింది

తన జీవితంలో ఉన్న వెలితి ఏమిటో ఆవిడ చెప్పకుండానే చెప్పినట్లు తోచింది.

'ఇన్స్యూర్' చెయ్యని జీవితంలా— భద్రత లేని మనిషయ్యాడు తను!

ఇన్నాళ్లూ గుర్తుకిరాని ఒంటరితనం యిప్పుడు మేరువంత్తై మీద కురికింది.

తను ఒంటరివాడు!

గాలి రాని గదిలో ఉన్నట్లు ఉక్కిరి బిక్కిరయ్యాడు.

ఈ ఒంటరితనం తను సృష్టించుకున్నది...

తన స్వయంకృతం!

గడియారపు టిక్కు టిక్కుల మధ్య మనస్సు గతంవైపు దారితీసింది.

తల్లిదండ్రులు లేని తనని పెత్తండ్రి పెంచి వారసుణ్ణి చేసుకోవటం—ఆ రూపేణా లభించిన లక్షల ఆస్తి—ఆస్తితో బాటు అంకురించిన ఖరీదయిన దురల వాట్లు!

ఏ పువ్వూ తన 'ఫవర్ వాజ్'లో పూటకంటే ఉండకూడదు

ఏ పడతి నవ్వూ తన చెవుల్లో రెండో రోజు వినిపించకూడదు.

అలా జీవితాన్ననుభవిస్తూ వచ్చాడు.

తన పోకడల్ని ముందే పసిగట్టిన పెత్తండ్రి పలువిధాల ప్రయత్నించి తనలో మార్పు తీసుకురాలేక చివరి రోజుల్లో ఒకపని చేసాడు. ఖరీదయిన

గోడగడియారం తెచ్చి తనగదిలో పెట్టించాడు. అర్థంగానట్లు చూస్తున్న తనని చూస్తూ అన్నాడు–

"ఒరేయ్ నందుడూ! యీ గడియారం యిక్కడెందుకు బిగింపిస్తున్నానో తెలుసా?"

తెలియదన్నట్లు తలాడించాడు తను.

"అసలు గడియారం అంటే ఏమిటో, అదెందుకు మనిషి జీవితంలో ఒక భాగమైందో నీకు తెలియాలి. పూర్వం కాలాన్ని సూర్యగమనంతోను, తిథుల తోను కొలిచేవారు గడియారం పుట్టాక మనిషి నదిని కొనేసింది! నిముషాల ముల్లుతో కొన్నాళ్లు పరిగెత్తిన మనిషి, దాంతో తృప్తిచెందక సెకండ్ల ముల్లు తగిలించాడు. నిజానికి గడియారం మనిషికి మిత్రుడు కాదు శత్రువు! గంట గంటకీ మోగుతూ మనల్ని హెచ్చరిస్తుంటుంది. నీ జీవితం అనే కొవ్వొత్తి గంట కాలింది సుమా అని మృత్యు సంకేతాల్ని టిక్కు, టిక్కుల్లో విన్పిస్తుంటుంది. మృత్యు సంగీతాన్ని గంటల్లో ఆలపిస్తుంటుంది"

"ఇలాంటి శత్రువు మనకెందుకు పెదనాన్నా? పైగా నా గదిలో ఎందుకు?" అంటే ఆయన నవ్వి–

"కారణం ఉంది! ఇప్పుడు నీ గదిలోకి పాము దూరిందనుకో. నువ్వు ప్రశాంతంగా ఉండగలవా? ఉండలేవు పాము ఎటువైపు నుంచి వచ్చి అమాంతం మీదపడి కాటేస్తుందోనని వణికిపోతుంటావ్. ఊహల్లో పాము కరిచినట్లే భ్రమించి చావు భయంతో మంచం మధ్యలో కూర్చుంటావ్. పాముని చంపే ధైర్యం ఉంటుందా. ఏ కర్రనో అందుకుని ఆ పని చేస్తావ్. లేదంటే నీ భయం నిజమవుతూ పాము కాటుకి చస్తావ్...శత్రువు పక్కలో బల్లెంలా ఉన్నప్పుడే మనిషిలో శక్తులు చైతన్యవంతంగాను అప్రమత్తంగానూ ఉంటాయి. ఇప్పుడీ గడియారం నీకు శత్రువు! ఇది విన్పించే కాలసత్యాలూ, హెచ్చరికలూ నేనీ లోకంలో లేకపోయినా నీకు విన్పిస్తూ ఉండిపోవాలనే దీన్నిక్కడ పెట్టిస్తున్నాను..." ఆయన ఒకప్పుడు వ్యాపకానికి బడిపంతులుమరి!

ఆయన మాటలు నిజమన్నట్లు కొత్త గడియారం చెవుల్ని చీలుస్తూ గంటలు కొట్టింది. తను నివ్వెరబోయేడు.

ఆ తర్వాత కొద్దిరోజులకే ఆయన కాలం చేసాడు.

తను సెంటిమెంటల్ ఫూల్ కాదు. అయినా పెత్తండ్రి అక్కడ ఆ రోజు నిలబడి అన్నమాటల్నే తిరిగి, తిరిగి గడియారపు గంటల్లోంచి వింటున్నట్లుంటే దాన్నక్కణ్ణుంచి తొలిగించేశాడు.

అప్పట్నుంచీ గడియారాల మీద ఆసక్తి చచ్చిపోయింది.

పెత్తండ్రి కొనిచ్చిన రిస్టువాచీని

వాడకుండా ఉంచేసి, మరోటి కొనుక్కున్నాడు. అది కూడ అతి తక్కువగా వాడతాడు. చెంద్రిగాడి కిచ్చేసింది పెత్తండ్రి గడియారమే!

చెంద్రిగాడు!

నందగోపాల్ మనసు గిలగిల్లాడింది.

తెల్లకుందేల్లాంటి మల్లి రూపం కళ్ళ ముందు కదిలింది.

తల మీద గాయం మళ్ళీ రేగినట్లనిపించింది!

పోట్లు...బాధ...

ఎవరో తనని తలమీద గట్టిగా కర్రతో కొడుతున్నారు. "ముట్టుకోవద్దు...దగ్గిరావొద్దు...సంపేత్తా...." జుట్టు విడిన కాళి గొంతులోంచి గర్జనలు వినిపిస్తున్నాయి.

కాళి రౌద్రంగా, అర్ధనగ్నంగా ఉంది.

నందగోపాల్ వణికిపోతున్నాడు.

ఆశ్చర్యం!

కాళికి ఐదులు కుందేలు కనిపించింది.

తెల్ల కుందేలు!

ఎర్రని అగ్నిగోళాల్లాంటి ఆ కళ్ళలో కాళి కరాళ నృత్యం ప్రతిబింబిస్తోంది.

కాళి అర్ధనగ్నంగానే ఉంది!

ఎదురుగా నాలుక జాచి ఆకలిగా చూస్తున్న వేటకుక్క మీదకి ఎగిరి దూకింది కుందేలు.

తోక ముడిచి పరుగులు తీస్తోంది వేటకుక్క.

ఉలిక్కిపడి చుట్టూ చూసేడు నందగోపాల్.

అది ఆస్పత్రే!

మెల్లగా అతనికి మామూలు స్పృహ కల్గింది.

ఎదురుగా ఉన్న గోడగడియారం ఎప్పటిలా కాలసంకేతాన్ని చూపిస్తూ, జీవన సంగీతాన్ని వినిపిస్తూనే ఉంది!

ఇప్పుడతను పశ్చాత్తాపం ఒడిలో అప్పుడే కళ్ళు తెరచిన పసిబిడ్డలా, నిర్మలంగా ఉన్నాడు!